అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
ఆదివారం 04 జూన్ 2023

బడీడు పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించాలి

అదిలాబాద్‌రూరల్ : బడీడు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సెక్టోరల్ అధికారి నారాయణ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రాథమిక పాఠశాల బంగారుగూడ, ప్రాథమికోన్నత పాఠశాల అనుకుంట గ్రామాల్లో పాల్గొన్నారు. మన ఊరు మన బడి వంటి పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించబడుతున్నాయన్నారు. యూనిఫాం, పాఠ్య పుస్తకాలతో పాటు ఈ విద్యా సంవత్సరం నుంచి నోటు పుస్తకాలు కూడా అందించనున్నారని తెలిపారు. తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సుజాత్‌ఖాన్, స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ ఉస్మాన్, ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రిమ్స్ డైరెక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్ : ఈ నెల 6 వరకు వేతన బకాయిలు చెల్లించకపోతే 8 నుంచి 12 వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని, అనంతరం 13నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని రిమ్స్ జనరల్ ఆసుపత్రి ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. శనివారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. సంఘం అధ్యక్షుడు బండ శ్రీనివాస్ మాట్లాడుతూ శక్తి సొసైటీ ఏ నెల కూడా సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని వాపోయారు. ప్రస్తుతం ఏప్రిల్, మే నెల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించకపోవటంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సదరు ఏజన్సీ సకాలంలో వేతనాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని కోరారు.



ఆశలు తీరేనా...భరోసా దక్కేనా..?

- జిల్లాలో ధీర్ఘకాలికంగా పెండింగ్‌లో సమస్యలు
- కలగానే మారిన ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్
- పరిష్కారం కోసం జిల్లావాసుల ఎదురుచూపులు
- నేడు నిర్మల్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ రాక
- సమీకృత కలెక్టరేట్..పలు అభివృద్ధి పనులు ప్రారంభం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నూతన జిల్లాగా రూపాంతరం చెందిన నిర్మల్ జిల్లా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఇప్పటికే పట్టణంతో పాటు పల్లెల్లోనూ పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. కానీ దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలు మాత్రం అలాగే ఉండిపోయాయి. వీటితో పాటు పలు రకాల సమస్యలను సైతం పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లాకు ఇప్పటి వరకు రైల్వే సౌకర్యం లేకుండా పోయింది. వీటితో పాటు బీడీ కార్మికులు, గల్ఫ్ బాధితుల సమస్యలతో పాటు నిలిచిపోయిన అభివృద్ధి పనులు, గతంలో ఇచ్చిన హామీల అమలు కోసం భరోసా ఇవ్వాలని కోరుతున్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రానున్నారు. నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, నిర్మల్

నూతన జిల్లా ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ తొలిసారి జిల్లాకు వస్తున్నారు. జిల్లా అభివృద్ధికి గతంలో హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి అనేకం నెరవేర్చారు. కానీ కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇప్పటికే జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరుచేయడంతో ఈ ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రంలో రూ.కోట్లాది నిధులతో అనేక అభివృద్ధి పనులు పూర్తిచేయడంతో నూతన కళను సంతరించుకుంది. కానీ కొన్ని హామీలతో పాటు కొత్తగా చేపట్టాల్సిన పలు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. నిర్మల్ జిల్లా కేంద్రానికి ఇప్పటి వరకు రైల్వే సౌకర్యమే లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్ వరకు నూతన రైల్వేలైను మంజూరైంది. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ రైల్వేలైన్ పూర్తయితే జిల్లావాసులకు రాజధాని హైదరాబాదుతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రవాణా సులభతరం అవుతుంది. ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకొని దృష్టిసారించాలని కోరుతున్నారు. నిర్మల్ పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతామని, ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం తదితర వాటికి ముఖ్యమంత్రి గతంలో హామీనిచ్చారు. కానీ పెండింగ్‌లో పడిపోయాయి. వీటి కోసం తాజాగా నిధులు కేటాయించేందుకు భరోసా ఇవ్వాలని జిల్లావాసులు కోరుతున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలపైనా దృష్టిసారించి పరిష్కారించాలని అక్కడి విద్యార్థులు చెబుతున్నారు. బాసర ఆలయ మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించింది.ఇందులో రూ.50కోట్లు విడుదల చేసింది. కానీ కేవలం రూ.8కోట్ల పనులు మాత్రమే పూర్తయాయి. మిగిలిన వాటిని పూర్తిచేయడంలో జాప్యం జరుగుతోంది.

పరిహారం కోసం ముంపు గ్రామాలు



ప్రారంభానికి ముస్తాబైన కలెక్టరేట్

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురైన 33 గ్రామాలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. ఆయా గ్రామస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు కాళేశ్వరం 27,28 ప్యాకేజీ కింద చేపడుతు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పలు ప్రాజెక్టులకు సంబంధించి సాగునీటి కాల్వలు కూడా సక్రమంగా లేవు. ఖానాపూర్ నియోజకవర్గంలోని మేడంపెల్లి వద్ద నిర్మించాల్సిన బ్యారేజీని సదర్మాట్‌కు ఎగువన 7కిలోమీటర్ల దూరంలో పోన్కల్ వద్ద నిర్మించారు. అక్కడ్నుంచి కాల్వ ద్వారా సదర్మాట్ ఆనకట్టలోకి నేరుగా నీళ్లిస్తామని చెప్పిన ప్రభుత్వహామీ నెరవేరడం లేదు. రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో గల్ఫ్ బాధితులు అధిక సంఖ్యలో ఉంటారు. వీరికి ప్రభుత్వం బాసటగా నిలవాల్సిన అవసరం ఉంటుంది. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడంతో పాటు పీఎఫ్ సౌకర్యం లేనివారికి కూడా అందించాలని కార్మికులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా సమస్యలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

మహిళా క్రీడాకారులను లైంగికంగా వేధించిన ఎంపీని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-హాజీపూర్

దేశ రాజధాని ఢిల్లీలో మహిళా కుస్తీ క్రీడాకారులను లైంగికంగా వేధించిన కుస్తీ సంఘం అధ్యక్షుడు, అధికార పార్టీ ఎంపీ బ్రిజ్ భూషన్‌సింగ్‌ను తక్షణం అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని భారత్ బచావో మంచిర్యాల జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మహిళలు బయట అడుగు పెట్టడానికి భయపడుతున్న వేళ అధికార పార్టీ ఎంపీ ఇలాంటి నీచ కార్యాలకు ఒడిగట్టడం సిగ్గుచేటన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ధఖలు పరిచిన ఎఫ్ఐఆర్‌లో సదరు ఎంపీ చేసిన నేరాలన్నీ బహిర్గతమవుతున్నాయని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళలతో పాటు చిన్నపిల్లలని సైతం వేధించాడంటూ బాధితులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. పోస్కో చట్టం ప్రకారం తక్షణం అరెస్టు చేయాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వ పెద్దలు సదరు ఎంపీని రక్షించడం తగదని పేర్కొన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో దేశానికి పతకాలు తెచ్చి దేశ గౌరవాన్ని నిలబెట్టిన ఆడపడుచులను వేధించడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు గొప్పగా చెబుతున్న బేటీ బచావో అర్థం ఇదేనా అంటూ వారు ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ పరిగణనలోని తీసుకుని ఎంపీని సత్వరం అరెస్టు చేయాలని, మరొకరు ఇలాంటి దుస్సాహానికి పాల్పడకుండా కఠిన శిక్ష విధించాలని, ఎంపీ సభ్యత్వాన్ని సైతం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా చైర్మన్ కునుకుంట్ల మల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వడ్డేపల్లి మనోహర్, జిల్లా కమిటీ నాయకులు రంగు రాజేశం, గుమ్ముల శ్రీనివాస్, సంగం లక్ష్మణ్, ఇబ్రహీం, సుంక లక్ష్మణ్, రాసపల్లి రాజు, శేఖర్, రవూఫ్, చంద్రయ్య పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఏటియుసి జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ తెలిపారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీలలో మేడ్చల్ జిల్లా జంగం లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 3వ మహాసభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిస్టం ఉండబోదని, కాంట్రాక్ట్ వ్యవస్థ అంటేనే దుర్మార్గపు శ్రమ దోపిడీ వ్యవస్థ అని అన్నారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన వెంటనే కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేస్తామన్నారని తెలిపారు. ఇంతవరకు కేసీఆర్ హామీలేవీ నెరవేర్చలేదని మండిపడ్డారు. మేడ్చల్ జిల్లాలో జరగబోయే రాష్ట్ర 3వ మహాసభలు చాలా కీలకమైనవని తెలిపారు. మహాసభల్లో అనేక తీర్మానాలు చేసి పోరాటాలకు సిద్ధం కాబోతున్న నేపథ్యంలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి. గణపతి, నాగరాజ్, సాయన్న, శ్రీనివాస్, రాధిక, లింగన్న, శివాజీ, శ్రీను, సతీష్, మైసూర్ పాల్గొన్నారు.

కేసీఆర్ చొరవతోనే కారుణ్య నియామకాలు

రెబ్బెన:కేసీఆర్ చొరవతోనే కారుణ్య ఉద్యోగాలు సింగరేణి కార్మికులకు అందుబాటులోకి వచ్చాయని టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో కారుణ్యం ద్వారా అన్‌ఫిట్ అయిన కార్మికులను ఆయన కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కారుణ్యం పొందిన కార్మికులు కాసిపేట సారయ్య, ఎల్లెల బానయ్య, వేవుల శంకర్ టీబీజీకేయస్ నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కారుణ్య నియామకాలు పొందిన కార్మికులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కేసీఆర్ చొరవతోనే కారుణ్య ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ సాధనతోనే సింగరేణిలో కారుణ్య నియామకాలు అందుబాటులోకి వచ్చాయని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేయస్ నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో 2018 నుండి ఇప్పటివరకు సుమారు 15వేల మంది కొత్త ఉద్యోగులను కారుణ్యం ద్వారా నియమించారన్నారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్‌రావు, ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకటేశం, మాజీ వైస్ ప్రెసిడెంట్ సదాశివ్, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మారిన వెంకటేశ్, ఏరియా నాయకులు భాస్కరచారి, ఓరం కిరణ్, రాజేశం, ముగిలయ్య, ఆదె శ్రీనివాస్, మధుసూధన్, బొంగు వెంకటేశం, కుడుదుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన బడిబాట

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని చింతగూడ, ఈజ్‌గాం గ్రామాల్లో ఉపాధ్యాయులు, నాయకుల ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, నాణ్యమైన పోషకాలు కలిగిన మధ్యాహ్న భోజనంతో పాటు సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధ్యాలతో బోధన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు నికూరే నాగేందర్, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, శంకర్, ఉపాధ్యాయులు శాంతికుమారి, బడుగు శ్రీనివాస్, మోహన్ దుర్గం, పండరి నాథ్, ప్రదీప్ కుమార్, పచాయతీ సెక్రటరీ హరీష్, ఏఈఓ యువరాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృథా వస్తువుల వినియోగంపై అవగాహన

కాగజ్‌నగర్ : వృథా అయిన వస్తువులను తిరిగి ఏ విధంగా వినియోగంలోకి తీసుకురావాలనే విషయంలో శనివారం స్థానిక ఎస్పీఎం హెచ్ఆర్‌డి హాలులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్పీఎం మరియు పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మిల్లు జీఎం ఎంఎస్ గిరి మాట్లాడుతూ పాడైన వస్తువులను తిరిగి ఎలా వినియోగించాలి, వాటితో అద్భుతమైన వస్తువులను ఎలా తయారుచేయాలనే విషయంలో విద్యార్థులకు అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, పర్యావరణ పరిరక్షణ కేంద్ర సంస్థ ప్రతినిధులు వినీల్, అశోక్, సుశీల పాల్గొన్నారు.

ఆర్‌కె-1ఎ గనిలో పర్యావరణ క్విజ్ పోటీలు

రామకృష్ణాపూర్ : పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం ఆర్కే-1ఏ గని మీద కార్మికులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ బి.జయంత్‌కుమార్ మాట్లాడుతూ కార్మికులందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడటం తగ్గించాలని, అలాగే గని రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి కోరారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 5న మందమర్రి సింగరేణి గ్రౌండ్‌లో నిర్వహించే తెలంగాణ సంబరాల కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గని పిట్ ఇంజనీర్ సతీష్, గని సేఫ్టీ ఆఫీసర్ దిలీప్, సీనియర్ అండర్ మేనేజర్ రవి, గని వెల్ఫేర్ ఆఫీసర్ జె.శ్రీనివాస్, టిబిజికెఎస్ పిట్ సెక్రెటరీ బండారి భిక్షపతి, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రమాదాలు అరికట్టాలి

నస్పూర్ : గనులలో సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రమాదాలను అరికట్టాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ అన్నారు. ఎస్ఆర్పి 3,3ఏ గనిలో కొద్ది రోజులుగా ప్రమాదాలు జరుగుతుండడంతో శ్రీరాంపూర్ గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్, గని మేనేజర్ సంతోష్‌కుమార్, జీవియస్ విజయ్‌కుమార్‌తో కలిసి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రత అనేది ఇంటి నుండే మొదలుకొని తిరిగి ఇంటికి చేరేవరకు పాటించాలని, విధులలో ఎస్ఓపీల ప్రకారంగా పని స్థలల్లో రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించి ప్రమాదాలను అరికట్టాలని, 'వ్యక్తిగత భద్రతే నా బాధ్యత' అనే నినాదంతో జీరో హార్మ్ దిశగా భద్రతను ఎల్లప్పుడూ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పాల్వాయి పాదయాత్ర

కౌటాల : బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మండలంలో నాలుగు రోజులుగా నిర్వహించిన పల్లెపల్లెకు గడపగడపకు బీజేపీ పాదయాత్ర ముగిసింది. శనివారం బోదంపెల్లి, కన్కి, గురుడుపేట, కౌటాల మండల కేంద్రంలో పాయయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు ఏం చేసిందని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని సమస్యలను చక్కదిద్దుతామని, ప్రజలందరు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ధూం ధాం

కాగజ్‌నగర్ : తెలంగాణ రాష్ట్రం సిద్ధించి దశాబ్దకాలం ముగిసిన సందర్భంగా ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కన్వీనర్లు వి కిషోర్‌కుమార్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, మార్త సత్యనారాయణ, ఎం సుభాష్, జయదేవ్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదురుగా నిర్వహించే ఈ కార్యక్రమంలో తెలంగాణ ధూం ధాం కార్యక్రమంతో పాటు ఆటా పాటా, మాటా ముచ్చట కార్యక్రమం, తెలంగాణ ఉద్యమకారులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి తెలంగాణ ఉద్యమకారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా రైతు దినోత్సవం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని పలు గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు క్లస్టర్ పరిధిలోని చించోలి(బి), స్వర్ణ, బీరవెళ్లి, ఆలూరు గ్రామాల్లోని రైతు వేదికలలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యవసాయ రంగంలో జరిగిన ప్రగతిని, వివిధ పథకాలు, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా పథకంలో రైతులకు లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ ఛైర్మెన్‌లు నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మాధవ్‌రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తహశీల్దార్ సంతోష్‌రెడ్డి, వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓ సరోజ, ఎఈఓలు, రైతులు పాల్గొన్నారు.



సారంగాపూర్

బజార్‌హత్నూర్ : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రైతు వేదికలలో రైతు దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు దేగామ, టెంబి, మోర్కండి, భూతాయి-కే, పిప్రి రైతు వేదికల్లో బాజా భజంత్రీలతో ఎడ్ల బండ్లతో ర్యాలీ నిర్వహించి రైతులకు అందుతున్న పథకాలను పలువురు నాయకులు సమావేశంలో వివరించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మండల కేంద్రంలోని రైతువేదికను పరిశీలించి రైతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపిపి జయశ్రీ, ఎంపిడివో చౌహాన్ రాధ, సర్పంచులు పర్చ లావణ్య, సోము రాములు, దుర్వ లక్ష్మణ్, ఎంపీటీసీలు, పలువరు అధికారులు పాల్గొన్నారు.

అదిలాబాద్ రూరల్ : పొచ్చెర, చాందా-టి, మామిడిగూడ, ఖండాల, యాపల్‌గూడ, అంకోలి, కచ్‌కంటి రైతువేదికల్లో రైతు దినోత్సవ కార్యక్రమాలకు "సిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి రైతే రాజు అన్నారు. కార్యక్రమంలోమార్కెట్ చైర్మన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, ఎంపీపీ గంద్రత్ రమేష్, పిఎసిఎస్ చైర్మన్ పరమేశ్వర్, ఎంపీటీసీలు నాగుబాయ్ కిషన్, జంగు బాపు, తహసీల్దార్ శివరాజ్, వ్యవసాయ అధికారి అష్రఫ్, సర్పంచులు భూమన్న, లక్ష్మి శ్రీనివాస్, గంగారాం, యాదవరావు, అశోక్, దారట్ల భాస్కర్, కంది మమత, బిఆర్ఎస్ నాయకులు కనక రమణ, గొర్రెలు, మేకల సంఘం అధ్యక్షుడు గంగయ్య యాదవ్, ఏఈఓలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంతో పాటు వడూర్, బుగ్గారం, తేజపూర్, కుమారి, కోర్టికల్(బి), వాంకిడి రైతు వేదికలలో తెలంగాణ దశాబ్ది ఉత్సాలలో భాగంగా శనివారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నేరడిగొండ రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, జెడ్పిటిసి అనిల్ జాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కాకముందు రైతు పరిస్థితి చాలా దయనీయంగా ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రైతుబంధు పథకంతో రైతుల పెట్టుబడి ఇబ్బందులు తొలగిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గడ్డం భీంరెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ సాబ్లే కిషోర్, తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో సమద్, ఏవో భాస్కర్, రైతు వేదికల ప్రత్యేక అధికారులు, ఏఈఓలు, ఎంపిటిసిలు, రైతులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ : మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

భీమిని : మండలంలోని రైతువేదికలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఎడ్ల బండ్ల ర్యాలీ చేపట్టారు. వ్యవసాయ రంగంలో చేసిన అభివృద్ధి, రైతు సంక్షేమ పథకాలను ఆయా గ్రామాల రైతువేదికల్లో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, జడ్పిటిసి పోతురాజుల గంగక్క, వైస్ ఎంపీపీ చిలుముల మధు, మండల పంచాయతీ అధికారి షేక్ సప్దర్ అలీ, ఏవో విజయ్‌కుమార్, ఎపిఎం ప్రకాష్‌గౌడ్, ఏపీవో భాస్కర్‌రావు, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : కమ్మర్‌గాం, ఎలుకపెల్లి, చెడ్వాయి రైతువేదికల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతువేదిక వద్దకు డప్పుచప్పుళ్లతో ఎడ్ల బండ్ల ర్యాలీతో చేరుకున్నారు. చెడ్వాయి రైతువేదికలో తహసీల్దార్ సరిత, కమ్మర్‌గాం రైతువేదికలో ఎంపీడీఓ గంగాసింగ్, ఎలుకపెల్లి రైతువేదికలో ఏఓ రాజులనాయుడు ప్రత్యేకాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ఎడ్ల బండ్లతో ర్యాలీగా వచ్చిన రైతులను సన్మానించారు. పలువురు రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్‌లు ఉపాసి సంజీవ్, గణపురం క్యావ, కమల, సుజాత, పొరిశెట్టి మధునయ్య ఈశ్వరి, జాజిమొగ్గ శ్రీనివాస్, దుర్గం రాజన్న దాసరి చంద్రమౌళి, ఎంపీటీసీలు, వ్యవసాయాధికారులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కౌటాల : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మండల కేంద్రంతో పాటు గుండాయిపేట్, గుడ్లబోరి, గురుడుపేట్, ముత్తంపేట్, సాండ్‌గాం రైతువేదికల్లో రైతుల సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎడ్ల బండ్లతో రైతులు ఊరేగింపుగా రైతువేదిక వద్దకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం భోజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ రూరల్ : కచ్‌కంటిలో..



కౌటాల

లోక్ అదాలత్‌కు ఎక్కువ కేసులు వచ్చేలా చూడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 10న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఎక్కువ రాజీ కేసులు వచ్చేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎంవి రమేష్ తెలిపారు. కోర్టు హాల్‌లో గురువారం న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న లోక్ అదాలత్ నిర్వహిస్తామని, దీనికి ఎక్కువగా రాజీ కేసులు వచ్చేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రి-లిటిగేషన్ కేసులు, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగాదా కేసులు, వివాహ/ కుటుంబ తగాదాల కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులు ఇతర రాజీపడదగు కేసులను పరిష్కరించబడతాయని తెలిపారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు భువనగిరి సతీష్ బాబు, సీనియర్ న్యాయవాదులు తాటిపల్లి సురేష్, డి.వెంకటేష్, జగన్‌మోహన్‌రావు, గవర్నమెంట్ ప్లీడర్ దీపక్, కిషోర్, తేజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల పట్ల చిత్తశుద్ధి ఉందా..?



నవతెలంగాణ-భీమారం

రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా? అని కాంగ్రెస్ నాయకురాలు రామిల్ల రాధిక ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన బెట్టి ఇంకా మోసం చేయడం ప్రభుత్వానికి తగదని విమర్శించారు. సంబరాల పేరుతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మసిబూసి మారేడుకాయ చేస్తున్నట్లుందన్నారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ రైతు దినోత్సవం పేరుతో రైతు పండించిన పంటను గాలికి వదిలేసి కూటమి ఏర్పాటు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రైతు పండించిన పంట చేతికి వచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఆ ధాన్యం కేంద్రాల్లో మగ్గిపోతుంటే ఆ సమస్యను పక్కన బెట్టి రైతులను మభ్యపెట్టడం సరైంది కాదన్నారు. నిజంగానే ప్రభుత్వానికి రైతు పట్ల ప్రేమ ఉంటే పంటను కొనుగోలు చేసి 24 గంటల్లో సొమ్మును రైతు ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట నాయకులు గుడిమల్ల వెంటేశం, దుర్గం లాజర్, గోనె లింగస్వామి ఉన్నారు.

ప్రతిభ కనబరిచిన ఉద్యోగుల ఎంపిక

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను సింగరేణి సంబరాలు 2023 సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్టు బెల్లంపల్లి ఏరియా జీఎం జి దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీ స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా బండారు శ్రీనివాస్, ఈపీ ఎలక్ట్రీషన్, ఖైరిగూడ ఓసీపీ స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికచేసిన బొచ్చు నరేష్, డీవై సూపరింటెండెంట్ (ఖైరిగూడ ఓసీపీ), ఎల్లబోయిన రమేష్, ఈపీ ఆపరేటర్(ఖైరిగూడ ఓసీపీ), భీంరావు జాడె సీహెచ్‌పీ గోలేటి, డీవై జీఎం(ఈఅండ్ఎం), గిరిగిరి రాజేష్, ఫోర్‌మెన్, గ్రేడ్ ఎ సీహెచ్ (గోలేటి), జయశీల, స్టాఫ్ నర్స్(ఏరియా ఆస్పత్రి), గురిజాల రమేష్, షిఫ్ట్ మజ్దూర్(స్టోర్ ఏరియా), మడెపు సదానందచారి, జనరల్ మజ్దూర్(సివిల్), లక్ష్మీనారాయణ, ఫోర్‌మెన్ ఇన్‌చార్జి ఎంపికయ్యారు. ఎంపికైన ఉద్యోగులను గోలేటిలోని భీమన్న క్రీడా మైదానంలో ఈ నెల 5న జరిగే సింగరేణి వేడుకల్లో సన్మానించి జ్ఞాపికను అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన

నవతెలంగాణ-నార్నూర్

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన కొనసాగుతోందని ఎంఈఓ ఆశన్న అన్నారు. శనివారం మండలంలోని తాడిహత్నూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల ప్రవేశం కొరకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా వివిధ తరగతుల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ప్రభుత్వం పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. అదేవిధంగా ఉమ్మడి మండల కేంద్రంతో పాటు జామడ, పుసిగూడ, సాంగ్వి తదితర గ్రామాల్లోని పాఠశాలలో పోషకులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అడ్మిషన్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజేంద్ర, గణపతి, గోపాల్, సర్పంచ్ ముక్తా రూపదేవ్, పాఠశాల సిబ్బంది విశ్వనాథ్, శివాజీ, కైలాస్, మల్కు, రాజు, రవీందర్, శేఖర్‌బాబు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ దినచర్యలో సైకిల్‌ను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రతి ఒక్కరూ దినచర్యలో సైకిల్‌ను వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ అన్నారు.శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆలూరు గ్రామంలో శనివారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ ర్యాలీని ప్రారంభించారు. ప్రతిరోజు సైకిల్ తొక్కడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సైక్లింగ్ ఒక మంచి ఆయుధమని సూచించారు. ఉదయం నడకతో పాటు సైక్లింగ్ చేయడం వల్ల బీపీ, షుగర్ వంటి జబ్బులను రాకుండా ముందుగా అరికట్టుకోవచ్చని తెలిపారు. సైక్లింగ్ వల్ల శరీర కండరాలు మెరుగుపడుతాయని చెడు కొవ్వు కరిగిపోయి గుండె జబ్బులు రాకుండా అరికట్టుకోగలుగుతామని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుభాష్, ఎంఎల్‌హెచ్‌పీ మోహిన్ అలీ, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్ సరస్వతి ఆరోగ్య కార్యకర్తలు నుశ్రత్, గంగు, ఆశా కార్యకర్త రాజమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ రైతు దినోత్సవం

హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ వేడుకల్లో భాగంగా శనివారం మావల మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద నిర్వహించిన రైతుదినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి ఆయన పాల్గొన్నారు. మొదట మావల గ్రామపంచాయతీ నుండి రైతు వేదిక వరకు ఎడ్లబండ్లపై కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ శాఖ ప్రగతి నివేదికలను అధికారులు సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తుందని తెలిపారు. జిల్లాలో రైతుబంధు పథకం ద్వారా 1,47,161 మంది రైతులకు రూ.2363.67 కోట్లను వారి బ్యాంకు ఖాతాలో జమచేయడం జరిగిందని అన్నారు. రైతు భీమా పథకం ద్వారా వివిధ కారణాలతో మరణించిన 3,088 మంది రైతులకు రూ.154.4 కోట్లను వారి నామిని ఖాతాల్లో జమ చేశామని అన్నారు. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా 6643 మంది రైతులకు రూ.27 కోట్లతో ట్రాక్టర్లు, స్ప్రేయర్లు వంటి పరికరాలు సబ్సిడీ రూపంలో అందించడం జరిగిందని తెలిపారు. 1,81,933 మంది రైతులకు పంట నష్ట పరిహారం కింద రూ.86 కోట్లు వారి బ్యాంకు ఖాతాలో జమచేశామని అన్నారు. జిల్లాలో 101 రైతువేదికలు నిర్మించి, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అధికారులచే రైతులకు సలహాలు, సూచనలు అందించడం జరుగుచున్నదని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తిచేస్తుకొని పదో సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా 21రోజులపాటు నిర్వహించే వివిధ కార్యక్రమాలను ప్రజలందరి భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత వ్యవసాయ రంగం అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం రైతుబంధు, రైతు భీమా, 24 గంటల విద్యుత్, మిషన్ కాకతీయ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ధరణి పోర్టల్‌ను ప్రారంభించి, 33 రకాల మాడ్యూల్‌ల ద్వారా వివిధ రకాల భూసమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. సంక్షేమ దినోత్సవం సందర్భంగా వివిధ కుల వృత్తుల వారికి సంక్షేమ శాఖల ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సాయం, గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, జెడ్పీటీసీ వనిత రాజేశ్వర్, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ అరుణ, సర్పంచ్లు దోగ్గలి ప్రమీల రాజేశ్వర్, మయూరి భోజన్న, రాగం గంగమ్మ, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రానికి సమీపంలోని రైతు వేదికలో మండల తహసీల్దార్ ఎస్తేర్ వర్ణ, లచ్చింపూర్(బి) గ్రామ సమీపంలోని రైతు వేదికలో జెడ్పీ సీఈఓ గణపత్, ఎంపీడీఓ సురేష్, పోచంపల్లి గ్రామ సమీపంలోని రైతు వేదికలో ఎంపీఓ అతుల్ కుమార్, ఎంపీపీ అమృత్‌రావు, జెడ్పీటీసీ చంద్రకళలు హాజరై ఎడ్లబండి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలలో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండల విస్తరణ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులు రైతుల కోసం చేసినటువంటి సంక్షేమ పథకాల గురించి, రైతులకు చదివి వినిపించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని, రైతుల కోసం రైతుబంధు, రైతు భీమా, 24 గంటల నిరంతర విద్యుత్‌ను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యురాలు నీలాదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని తరోడ, కారేగాం, బ్రహ్మంగావ్, విఠోలి, రైతు వేదికలలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల భాగంగా రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రైతు వేదికలను విద్యుత్ బల్బులు, మామిడితోరణాలతో అలంకరించారు. రైతులు తమ గ్రామాల నుండి రైతు వేదికకు ఎడ్లబండ్లపై, ట్రాక్టర్లపై ర్యాలీగా వచ్చారు. రైతు వేదికలో సమావేశానికి ముందు జాతీయ గీతాలాపన చేశారు. 9 సంవత్సరాల్లో వ్యవసాయ రంగంలో రైతులకు ప్రభుత్వం కల్పించిన పథకాలు, ప్రగతి, వచ్చిన మార్పులు తదితర విషయాలను గురించి అధికారులు క్షుణ్ణంగా వివరించారు. రైతు వేదిక పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు పలు అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. అనంతరం అధికారులు రైతులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడంతో రైతులందరూ సామూహిక భోజనాలు చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి ,మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్య రవింధర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎఓ అజ్మీరా భాస్కర్, ఏఈఓలు విలాస్, ప్రవీణ్, శ్రీనివాస్, సిరాజ్, రుషికేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతుసమితి అధ్యక్షులు, నోడల్ ఆఫీసర్లు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు శనివారం రైతు వేదికల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని దొడంద, ముత్నూర్, తేజాపూర్, ఇంద్రవెల్లితో పాటు వివిధ క్లస్టర్‌లలో రైతుల ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల ద్వారా ర్యాలీ నిర్వహించారు. ఇంద్రవెల్లి రైతు వేదికల్లో సర్పంచ్ కొరేంగా గాంధారి చేతులచే జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రైతులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన తరువాత ప్రభుత్వం రైతుబంధు, రైతు భీమా వంటివి దేశంలో ఎక్కడ లేని పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వమని గుర్తుచేశారు. అనంతరం రైతులకు సహపంక్తి భోజనాలు చేశారు.



ఖానాపూర్ రూరల్

ఖానాపూర్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ, రైతు రాజ్యంగా ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సత్తెనపల్లి రైతు వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు అనేక పథకాలు ప్రవేశ పెట్టి వర్తింపజేస్తున్న ఘనత కేవలం తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు రైతులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టామని అన్నారు. ప్రభుత్వం తీరును ఆయన అభివర్ణించారు. రైతులకు రైతుబంధు, పెట్టుబడి సాయం, ఐదు లక్షల రైతు బీమా, ఆరోగ్య భీమా తదితరాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు సరఫరా అవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 700 చెరువులను అభివృద్ధి చేసి 35 హెక్టార్ల ఆయకట్టుకు నిరందిస్తున్నట్లు ఆయన వివరించారు. రైతులు సకాలంలో పంటలు వేసి దిగుబడి పొందాలని, సమయానుకులంగా పంటలు వేసి ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోవద్దని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోయిద్, సర్పంచ్ సీర్ల లక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ఏఓ ఆసం రవి, ఎంపీడీఓ బాలే మల్లేశంలతో పాటు స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బేల: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కాప్సి, కొగ్దూర్, చెప్రాల గ్రామాలలోని రైతు వేదికలలో రైతు దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం రైతులకు అందించిన పథకాల గురించి ప్రత్యేక కరపత్రాలను విస్తరణ అధికారులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు మన రైతుల పరిస్థితి ఏ విధంగా ఉండేదని, రాష్టం వచ్చిన తరువాత రైతుబంధు ద్వారా దళారి వ్యవస్థ తగ్గి రైతుల జీవితాలు ఎలా మారిపోయాయి అందరికీ తెలుసని అన్నారు. ఒక్కప్పుడు కరెంట్ కోసం రాత్రుల్లో బోర్ల దగ్గర, బావుల దగ్గర పోవాల్సి వచ్చేదని, ఎంతో మంది పాము కాటుకు గురై చనిపోయారని కానీ తెలంగాణలో ఇప్పుడు 24గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని రైతు కుటుంబంలో పెద్ద దిక్కు పోయాక వారి కుటుంబ పరిస్థితి చెల్లాచెదురు కావద్దని చనిపోయిన వారి కుటుంబానికి రూ.5లక్షలు ఇచ్చి వారి జీవితాలలో భరోసా కల్పించారని అన్నారు. తెలంగాణలో అమలౌతున్న పథకాలు మరెక్కడా లేవని ఇలాంటి ప్రభుత్వాన్ని కండ్లల్లో పెట్టుకొని చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు జక్కుల మధుకర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, ప్రమోద్‌రెడ్డి, మంగేష్ ఠాక్రె, గోడం సునీల్ సర్పంచ్‌లు గేడం అనసూయ, ఫైజుల్లా ఖాన్, మెస్రం దౌలత్, చౌహన్ సుధాకర్, తహసీల్దార్ సర్ఫరాజ్, ఎంపీడీఓ మహేందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు.



ముధోల్‌లో..



తలమడుగులో..



తాంసి

బడిబాట మొదటి రోజే 105 మంది చేరిక



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బడిబాట కార్యక్రమంలో భాగంగా మొదటి రోజునే 105 మంది విద్యార్థులను చేర్పించి ప్రధానోపాధ్యాయుడు గోపాల్ సింగ్ తిలావత్ సార్ శభాష్ అనిపించుకున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి వారం రోజుల పాటు బడిబాటను కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీని ఉద్దేశం బడి బయట ఉన్న డ్రాప్ ఔట్ పిల్లలను బడిలో చేర్పించడం తో పాటు బడి బయట విద్యార్థులకు పాఠశాలలో చేర్పించడం ముఖ్యోద్దేశం. ఈ బడిబాట ప్రారంభం రోజునే స్థానిక జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ సింగ్ తిలావత్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకే రోజున 6వ తరగతిలో 105 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. అందునాయక్ తండా నుంచి 25 మంది, భగత్ సింగ్ నగర్ నుంచి 5 మంది, ఎంపీపీఎస్ 1,2 నుంచి 33, 39 విద్యార్థులను అడ్మిషన్లు తీసుకున్నారు. మొదటి రోజునే ఇంత పెద్ద మొత్తంలో విద్యార్థులను చేర్పించడంతో ఆయనకు పలువురు అభినందించారు. ఈ బడిబాట ఉపాధ్యాయులు జి.నటేష్, ఎన్ నరేష్, పి.కుసుమ, జే.మురళి పాల్గొన్నారు.

విద్యారంగ హామీలు నెరవేర్చాలి



నవతెలంగాణ-నిర్మల్

సీఎం కేసీఆర్ విద్యారంగానికి సంబధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాగ్మారే మహేందర్, గడ్పాళే నవీన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సంధ్బంగా మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు విద్యారంగానికి సంబంధించి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ప్రభుత్వ ఐటిఐ కళాశాల, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, మహిళ యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీ తదితర హమీల్లో ఏ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకొకపోవడం సిగ్గుచేటని అన్నారు. అలాగే బాసరలోని ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలోని సమస్యలను కూడా గాలికి వదిలేశారని అన్నారు. సీఎం కేసీఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాగ్మారే ఆకాష్, నాయకులు గంగరాజు, బాబన్న, విశాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యాభోధన వంటి అంశాలను అధికారులు వివరించగా బడికి రాని పిల్లలను బడులలో చేర్పే దిశగా అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబానికి విద్య చేరాలన్న ఉద్దేశంతో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. నేటి నుండి తొమ్మిదో తేది వరకు మొదటి విడత, 12 నుండి 17వ తేది వరకు రెండవ విడత బడిబాట కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. స్థానిక నాయకులు సైతం బడి బాటలో పాలు పంచుకుని బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, మున్సిపల్ కమీషనర్ శైలజ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మార్కెట్ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, పండ్ల శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు తరలిరావాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఈ నెల 6న అసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహాజన్ సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కాంబ్లె బాలాజీ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకై మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నిరంతర ఉద్యమాలు చేస్తున్నారని అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 6న నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు దాసరి రాంప్రసాద్, జిల్లా నాయకులు అందారే బాలాజీ, శ్రీను ఉన్నారు.

చలో ఇంద్రవెల్లి.. భరో అప్లికేషన్..

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

దళితబంధు పథకంపై పురుటి గడ్డపై చలో ఇంద్రవెల్లి.. భరో అప్లికేషన్ కార్యక్రమానికి పిలుపు నిస్తూన్నామని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖానాపూర్ నియోజక వర్గంలోని ప్రతి దళిత లబ్దిదారులకు, దళితబంధు పథకం అందించాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్ నియోజక వర్గంలో కమిషన్లు ఇచ్చిన వారికే దళితబంధు ఇచ్చారని ఆరోపించారు. 2022 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ఒక్కరికైనా అందించారా అని ప్రశ్నించారు. దళితబంధు ప్రతి దళితుడికి అందించాలనే డిమాండ్‌తో ఈ నెల 5 నుంచి చలో ఇంద్రవెల్లి.. భరో అప్లికేషన్..అనే నినాదంతో తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

రైతు దినోత్సవం వేడుకల్లో రైతులు ఆందోళన



నవతెలంగాణ-సారంగాపూర్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో రైతులు ఆందోళన చేపట్టారు. మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటి నుండి కొనుగోళ్ల నత్త నడక నడుస్తుందని మొక్క జొన్న, వరి కొనుగోళ్ల పూర్తయ్యాకే రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించుకోవాలని రైతులు ఆందోళన చేశారు. వారికి ఎంపీటీసీ సామల పద్మ మద్దతు ప్రకటించి వేదిక మీద నుండి నేలపైన కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న సొసైటీ చైర్మెన్ నారాయణరెడ్డి రైతులు ఆందోళన చెందవద్దని సోమవారం నుండి కొనుగోళ్ల వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. దీనితో రైతులు శాంతించారు.

సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



నిర్మల్ జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నూతన భవనాలను ప్రారంభించేందుకు ఆదివారం వస్తున్న సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు భుక్యా జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం స్థానిక సీఎం రావు ఫంక్షన్ ప్లాజాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని కడం మండల కేంద్రం నుండి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని, పదివేలు మందికి పైగా జన సమీకరణకు ప్రణాళిక చేస్తున్నామని అన్నారు. నిర్మల్ పట్టణ పొలిమేరలో నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు పార్టీ బాధ్యులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఆశా వర్కర్ల పరీక్షలు వెంటనే రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



ఆశ వర్కర్ల పరీక్షలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అదనపు డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ ఆశా వర్కర్లపై పెరుగుతున్న దాడులకు అనుగుణంగా వేతనాన్ని రూ.18 వేలకు పెంచి, నిర్థిత వేతనం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 32 సంవత్సరాలు, మైదాన ప్రాంతాల్లో 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆది నుండి నేటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అన్ని శిక్షణలు పొందారని గుర్తు చేశారు. ఆశ వర్కర్లు రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేశారని పేర్కొన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో బీపీ, షుగర్ వంటి అన్ని రకాల జబ్బులకు పరీక్షలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు సకాలంలో అందిస్తున్నారని వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని వెల్లడించారు. వీటితోపాటు గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి కాలంలోను ఆశ వర్కర్లు ప్రజలను అప్రమత్తం చేస్తూ, కరోనా బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారని గుర్తు చేశారు. అటువంటి ఆశ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆశ వర్కర్ల పరీక్షను రద్దు చేయాలని వారికి రూ. 18 వేల నిర్థిత వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల వేతనాలలో జాప్యం వహించకుండా వేతనాలను ప్రతి నెల ఒకటి లేదా రెండో తారీకు కల్లా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, ఆశ యూనియన్ నాయకులు ఆశ, లక్ష్మి, ఛాయ, కమల పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన ప్రధాన హామీలన్నింటిని వెంటనే నెరవేర్చాలని కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేఖ్ ఇంతియాజ్ అన్నారు. శనివారం సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓ శ్యాంసుందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ నిర్వహించిన అనేక సభలు, సమావేశాల్లో ముస్లిం మైనార్టీల ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య ఇతర స్థితిగతులను అన్ని విధాల విశ్లేషణాత్మకంగా తెలుసుకునేందుకు సుధీర్ కుమార్ కమిషన్‌ను వేశారని గుర్తుచేశారు. దాని నివేదికను కూడా కమిషన్ సీఎం కేసీఆర్‌కు అందజేయగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌కు న్యాయపరమైన అధికారాలు, చట్టబద్ధత కల్పించడంలోను ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇతర వర్గాలకు ఇస్తున్నట్లే ముస్లిం మైనార్టీలకు కూడా వెంటనే ముస్లింబంధు పథకాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముస్లిం స్వతంత్ర సమరయోధుల పేరిట ప్రతి జిల్లా కేంద్రంలో విద్యా, సాంకేతిక, పరిజ్ఞాన సముదాయాలను నిర్మించాలని అన్నారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గతంలో పలుమార్లు ఇచ్చిన హామీల మేరకు నిర్మల్ పట్టణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్య వైజ్ఞానిక సముదాయ నిర్మాణానికి పట్టణ నడిబొడ్డున మూడు ఎకరాల భూమిని కేటాయించి రూ.5 కోట్లతో భవన నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా, పట్టణ శాఖ బాధ్యులు సయ్యద్ చాంద్ పాషా, శేఖ్ ఇంతియాజ్, శేఖ్ షాదుల్లా హుస్సేన్, మహమ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ అమీన్ బాబా, మహమ్మద్ అబ్దుల్ ఖదీర్, మహమ్మద్ నయీమ్ పాల్గొన్నారు.

ధాన్యం తడిసినందుకు ఉత్సవాలా..?

నవతెలంగాణ-కాసిపేట

వరి కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేయక తడిసి ముద్దయినందుకా, లేక తేమ పేరిట దోచుకుంటున్నందుకా ప్రభుత్వం రైతు ఉత్సవాలు నిర్వహిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతు పండించిన పంట కొనుగోలు చేసేందుకు దిక్కులేదు గాని, ఉత్సవాల పేరిట హడావిడి చేసేందుకే ప్రభుత్వం ఉందని అన్నారు. తొమ్మిది ఏళ్లుగా ఎంతమంది రైతులకు రుణమాఫీ చేశారో చెప్పాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయక, చేసిన కొంత రుణ మాఫీ సైతం బ్యాంకర్లు వడ్డీలకే పరిమితం అయిందని ఆరోపించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు చేయక రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంకు వెంటనే డబ్బులు చెల్లించలెక, ధాన్యం సైతం ప్రయివేట్ మిల్లులకు దోచి పెట్టేందుకే, తేమ పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇవన్నీ చేసినందుకు ప్రభుత్వం ఉత్సవాలు నిర్వహిస్తుందని ఎద్దేవా చేశారు.

యోగా గురువు వెంకటేశ్వర్లకు సన్మానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణానికి చెందిన యోగా శిక్షణ గురువు ముసిని వెంకటేశ్వర్లుకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సుందరరాజన్ చేతుల మీదుగా శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. స్థానిక ఏ-జోన్ రామాలయంకు చెందిన ముషిని వెంకటేశ్వర్లు 365 రోజులు యోగా విధానంలో ప్రతిరోజు 108 సూర్య నమస్కారాలు పూర్తి చేసినందుకుగాను గుర్తించి, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున సన్మానించారు. అనంతరం వెంకటేశ్వర్లు తనను గుర్తించి సన్మానించినందుకు గవర్నర్‌కి పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతుకు స్పందించిన మంత్రి

- ఒక్క ఫోన్‌తో సమస్య పరిష్కారం
- మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన రైతులు

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామ గ్రామానికి చెందిన వరి రైతు సమస్యను మంత్రి గంగుల కమలాకర్ శనివారం ఒక్క ఫోన్‌తో నెరవేర్చాడు. శుక్రవారం రైతులు వడ్లను కరీంనగర్ దగ్గర్లోని దుర్శెడ్ గ్రామంలోని వెంకటసాయిరాం మిల్లుకు వరి కొనుగోలు కేంద్ర నిర్వాహకులు పంపించగా మిల్లు యజమాని వడ్లు కొనుగోలు విషయంలో లారీలను ఆపడంతో రైతులు ఆందోళన చెందారు. 45 కిలోల వరి ధాన్యం బస్తా అయితేనే తీసుకుంటాము లేకుంటే లారీ లను అన్లోడ్ చేసుకోము అని తెలపడంతో రైతులు ఆవేదన చెంది తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కి ఫోన్ చేయడంతో వెంటనే స్పందించి మిల్లు యజమానితో మాట్లాడి రైతు సమస్యను తీర్చారు. అలాగే మంత్రి గంగుల కమలాకర్ రైతుతో మాట్లాడి 40 కిలోల కంటే ఎక్కువ తూకం వేయవద్దని అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజలు తెలంగాణ ప్రభుత్వం కొనడానికి సిద్ధంగా ఉందని, వరి కొనుగోలు విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతుతో మంత్రి గంగుల కమలాకర్ అన్నట్లు రైతు తెలిపారు. రైతు సమస్య పరిష్కరించినందుకు ఆలుగామ రైతులు గంగుల కమలాకర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బడీడు పిల్లలందరిని బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-దండేపల్లి

బడీడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించాలని కొండాపూర్ సర్పంచ్ శాంతయ్య అన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బాడీపాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్య ద్వారానే మనిషి పురోగతన్నారు. గూడెం గ్రామంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ వాణి ఆధ్వర్యంలో అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి అంగన్వాడీ కేంద్రంలో చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వారక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పి సురేందర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అసమర్థ పాలనకు చరమగీతం పాడాలి

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



నవతెలంగాణ-దండేపల్లి

రాష్ట్రంలో బీఆర్ఎస్ అసమర్థ పాలన నడుస్తుందని మోసపోయిన హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు ఆరోపించారు. శనివారం మండలంలోని వెలగనూరు గ్రామంలో గడపగడపకు పీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించారు. గత పది సంవత్సరాలుగా కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా చేస్తున్న సామాజిక కార్యక్రమాలను ఆమె వివరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించేలా చూడాలని ప్రజలను కోరారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బిళ్ళకురి శంకరయ్య, నాయకులు ఎర్రవెని చెన్నయ్య, చుంచు కిషన్, సత్యనారాయణ, అక్కల బుచ్చన్న, వెంకటేష్, కాంద్రపు శ్రీనివాస్, అక్కల శ్రీనివాస్, అంజన్న, మల్లేష్, మొగిలి, వెంకటేష్, రవి పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్‌పై కేసీఆర్ పోరాటం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయి రాజకీయాల్లో మార్పు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్న కేసీఆర్ ప్రయత్నం మంచిదే కానీ, కేవలం రైతుబంధు రైతు బీమా రైతుల కోసమే కాకుండా బీసీ రిజర్వేషన్లపై కూడా దేశవ్యాప్తంగా పోరాటం చేస్తే బాగుంటుందన్నారు. అసెంబ్లీ పార్లమెంట్లలో బీసీ రిజర్వేషన్ చట్టసభల్లో పోరాటం సాగించాలన్నారు. బీసీలకు అండగా నిలవాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదో తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 7 ఆపైన జీపీఏ సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గానికి చెందిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు కోసం జూన్ 11 లోపు ఈ పాస్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివద్ధి శాఖ అధికారి సజీవన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ సంప్రదించాలని, జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'నాటి రైతు ఇబ్బందులు ఇప్పుడు లేవు'

- మిషన్ కాకతీయ ద్వార చెరువుల పునరుద్ధరణ
- పంటల సాగుకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్
- పంటలను నిల్వ చేసుకోవడానికి గోదాములు
- మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లు
- చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

పంటల సాగులో నాటి ఇబ్బందులు ఇప్పుడు లేవని చెన్నూర్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోల్చితే తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయరంగం అద్భుతమైన ప్రగతిని సాధించిందని అన్నారు. గతంలో పంటలు పండించాలన్నా.. పండించిన పంటలు నిల్వ చేసుకోవాలన్నా.. చివరకు పంటలను అమ్ముకోవలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చేదని గుర్తు చేశారు. వ్యవసాయ సాగుకు ప్రధానంగా నీరు, నాణ్యమైన విద్యుత్ అందించాలని భావించిన తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వార చెరువులను పునరుద్ధరించుకున్నామని తెలిపారు. కాళేశ్వరంప్రాజెక్టు ద్వార రాష్ట్ర వ్యాప్తంగా సాగు నీటిని సరఫరా చేసుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా పంటల సాగుకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ పునర్జీవం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సమగ్రమైన కార్యాచరణతో రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తీర్ణం పెరిగింది. ఖరీఫ్, రబీ సీజన్‌లకు ముందు రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు నిల్వ చేసివుంచుకుంటున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా పండించిన పంటలను నిల్వ చేసుకోవడానికి గోదాములు నిర్మించుకున్నామన్నారు. మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసుకుంటున్నామని తెలిపారు. అనంతరం వరి పంట సాగులో అత్యధిక దిగుబడి సాధించిన గంగిపల్లి శివారు రైతు మద్దుల అంజిరెడ్డితో పాటు ఆపరాలు సాగు చేస్తున్న ముదిగుంట శివారు రైతు ప్యాగాల శంకరయ్యలను శాలువాలతో సన్మానించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గోదారి రమాదేవి లక్ష్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు, స్థానిక వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్, ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ మోహన్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ రామటెంకి లింగస్వామి పాల్గొన్నారు.

పండుగ వాతారణంలో రైతు దినోత్సవ వేడుకలు

తెలంగాణ రైతు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధి ఇందారం, కుందారం, వేలాల గ్రామాలలో శనివారం రైతు దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కుందారం రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకల్లో స్థానిక జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ సంతోషం శేఖర్‌తో పాటు క్లస్టర్ పరిధిలో గల వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందారం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గుండు తిరుపతి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బేతు తిరుపతిరెడ్డితో క్లస్టర్ పరిధిలో గల వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా వేలాల రైతు వేదికలో జరుపుకున్న రైతు దినోత్సవ వేడుకల్లో చెన్నూర్ మార్కెట్ కమిటి వైస్ చేర్మెన్ అర్నె సమ్మయ్యతో పాటు వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రైతు దినోత్సవ వేడుకల్లో పట్టణ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామంలోని రైతు వేదికకు శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పాల్గొన్నారు.రైతు వేదికకు రైతులతో నిర్వహించిన ఎడ్ల బండితో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం రైతు వేదికలో సభలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు.

కాగజ్‌నగర్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ప్రజల గుండెల్లో నిలిచేవిధంగా నిర్వహించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మండలంలోని దుర్గానగర్, వంజీరి, చింతగూడ, జంబుగ రైతు వేదికల్లో శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. దుర్గానగర్, వంజీరి రైతు వేదికలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నజ్రూల్‌నగర్‌లోని రైతులు తమకు అందుబాటులో ఉన్న వనరులతో వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. ఇక్కడ పండిస్తున్న పర్వాల్, పుచ్చకాయ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడించడం హర్షనీయమన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రజల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ దేశంలో రైతులకు పెట్టుబడి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. గతంలో యూరియా, ఎరువులు, పెట్టుబడులకోసం ఇంబ్బందిగా ఉండేదని ప్రస్తుతం ఎవరి రికమండేషన్ లేకుండా నేరుగా రైతుకు పెట్టుబడిసాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ కాసం శ్రీనివాస్, ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, అడిషనల్ కలెక్టర్ రాజేశం, డీఏఓ శ్రీనివాసరావు, ఏడీఏ మనోహర్, డెప్యూటీ తహశీల్దార్ రఘునాథ్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ గౌరీ శంకర్, ఉద్యానవన అధికారి శాంతిప్రియ, ఏఓ రామకృష్ణ, ఏఈఓలు శైలేష్, యువరాణి, సృజన, రోహిణి, సర్పంచ్‌లు ముంజం రమేశ్, చటారె స్వాతి, పురుషోత్తం, చింతపురి లక్ష్మి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు మెంత్యాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు మహెబూబ్‌ఖాన్, నాయకులు అమిత్ దాస్, రాకేష్ మిశ్ర పాల్గొన్నారు.



జన్నారంలో..

రెబ్బెన : సీఎం కేసీఆర్ రాజ్యం రైతు రాజ్యమని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం కన్నుల పండుగగా జరిగింది. మండలంలోని తక్కెళ్లపల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎడ్ల బండ్లతో, ట్రాక్టర్‌తో ర్యాలీలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే దేశం సుభీక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య ఆనంద్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీ మధునయ్య, సర్పంచ్ అహల్యాదేవి, వినోద, మధునయ్య పాల్గొన్నారు.

జన్నారం : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా రైతు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుండి రైతు వేదిక వద్దకు నిర్వహించిన ర్యాలీలో ఎడ్ల బండిపై ప్రయాణించారు. అనంతరం రైతు వేదికలో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతు బీమా రైతు బంధు పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు అభివద్ధిలో తెలంగాణను మోడల్‌గా తీసుకుంటున్నయన్నారు. మండలంలోని ఐదు రైతు వేదికల్లో ఈ రైతు దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శంకర్, ఎంపీపీ మాదాడి సరోజన, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మమ్మద్ రియాజుద్దీన్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, జిల్లా నాయకులు భరత్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, రైతు సమన్వయ సమితి సభ్యులు, ఏఈవోలు, సాయి, త్రిసంధ్య, అక్రమ్, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా రైతు దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంబారా గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వాంకిడి జడ్పీటీసీ అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయా గ్రామాల్లో నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంబారా గ్రామ సర్పంచ్ అయూబ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాసిపేట : తెలంగాణ రాష్ట్రం, దేశానికే ఆదర్శమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ వేర్వేరుగా పేర్కొన్నారు. శనివారం కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి, ధర్మారావుపేటలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంపల్లిలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కలెక్టర్ బదావత్ సంతోష్ ఎడ్ల బండ్ల ర్యాలీలో పాల్గొన్నారు. ధర్మారావుపేటలో రైతులు భారీగా ఎడ్ల బండ్లపై డప్పుల చప్పుళ్లతో తరలివచ్చారు. ఉత్తమ రైతులను ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ముత్యంపల్లి రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆర్డీఓ శ్యామలాదేవి, జిల్లా వ్యవసాయాధికారిని కల్పన, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ విక్రంరావు, రైతు సమితి మండల అధ్యక్షుడు దుర్గం పోశం, సహకార చైర్మన్ నీలా రాంచందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచులు సపాల్ శంకర్, దుస్స విజయ, రాంటెంకి శ్రీనివాస్, ఆడె బాదు, దేవి, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, మార్కెట్ కమిటీ డెరెక్టరు మంజులారెడ్డి, అన్ని శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రైతుల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆసిఫాబాద్ మండలం రహపల్లి రైతు వేదికలలో ఏర్పాటు చేసిన వేడుకలకు అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి హాజరయ్యారు. ఈనెల 22వ తేదీ వరకు నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లాలోని 70 రైతు వేదికలలో ఘనంగా రైతు దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వరరావు వైస్ ఎంపీపీ సుంకరి మంగ, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిదంగా మండలంలోని బూరుగుడ రైతు వేదికల నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండలంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో రైతులు తహసీల్దార్ శ్రీపాల్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి రైతువేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని బెజ్జూర్, సోమిని, కుకుడ, సలుగుపెల్లి గ్రామాల్లో రైతులు రైతు దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రోజా రమణి, జడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓం ప్రకాష్, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి, ఏపీఎం మోహన్‌లాల్, ఆర్‌డబ్ల్యుఎస్ అభిలాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బెజ్జూర్‌లో రైతు దినోత్సవం సందర్భంగా రైతుల భారీ ర్యాలీ



రెబ్బెనలో..



ఆసిఫాబాద్‌లో..

11వ వేజ్ బోర్డు చారిత్రక ఒప్పందం

నవతెలంగాణ-నస్పూర్

11వ వేజ్ బోర్డు ఒప్పందం చారిత్రక ఘనవిజయమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం ఆర్కే-6 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పదకొండవ వేజ్ బోర్డు కార్మికవర్గ ఐక్యతతో దేశంలో అన్ని వర్గాల కార్మికుల కంటే అద్భుతమైన వేజ్ బోర్డును సాధించుకున్నామన్నారు. కొన్ని అవగాహన లేని సంఘాలు, ఓర్వలేని సంఘాలు ఈ పెరుగుదలతో నిరాశ నిస్పృహకు లోనై కార్మికులను తప్పుదోవ పట్టించడానికి, కావాలని విమర్శిస్తున్నారని తెలిపారు. వారికి కార్మిక వర్గం తగిన గుణపాఠం నేర్పాలని అన్నారు. మొదటి క్యాటగిరి కార్మికునికి మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19శాతంతో పాటు ఇతర అలవెన్సులు కలుపుకొని రూ.10,229.26 పెరిగిందని, సీనియర్ ఉద్యోగులకు రూ.20వేల నుండి రూ.30 వేల వరకు జీతాలు పెరిగాయని తెలిపారు. స్పెషల్ అలవెన్స్ ఐదు శాతం కలిపితే 24శాతం జీతాలు పెరిగాయని, గత వేజ్ బోర్డు అంటే పదవ వేజ్ బోర్డు 20 శాతం మినిమం గ్యారంటీ బెనిఫిట్, నాలుగు శాతం స్పెషల్ అలవెన్స్ అంటే 24శాతం పెరుగుదల జరిగిందన్నారు. ఈ రెండు వేజ్ బోర్డులను కనుక జీతభత్యాలు చూస్తే 48శాతం జీతాలు పెరిగినవన్నారు.11వ వేజ్ బోర్డులో ఏదేని ఉద్యోగి భార్య గనుక డెలివరీ అవుతే ఆమెను చూసుకోవడానికి ఐదు రోజుల పెటర్నరీ లీవ్‌ను సాధించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రధానమైన అలవెన్సులను కూడా జులై ఒకటవ తేదీ నుండి ఇప్పించడం జరుగుతుందని, దీని ద్వారా అలవెన్స్‌ల పైన కూడా వేలాది రూపాయల ఏరియర్స్ రాబోతున్నాయన్నారు. తల్లి తండ్రి చనిపోయి ఉన్నటువంటి ఉద్యోగి కుటుంబానికి అంటే మైనర్‌గా ఉన్న పిల్లలకు మేజర్లు అయ్యేంతవరకు సగం జీతం ఇచ్చి 18 సంవత్సరాలు నిండగానే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విధానాన్ని 11వ వేజ్ బోర్డులో అగ్రిమెంట్ చేసుకున్నామని పేర్కొన్నారు. ఏదేని ఉద్యోగి మెడికల్ అన్ఫిట్ అయినా లేదా చనిపోయిన ఆ కుటుంబంలో పిల్లలు గనుక మేజర్లు కాకపోతే 12 సంవత్సరాల వయసు గనుక దాటి ఉంటే వారిని లైవ్ రోస్టర్‌లో పెట్టి కార్మికుడు భార్యకు ఎంఎంసీ ఇచ్చి 18 సంవత్సరాలు రాగానే ఆ కుమారునికి ఉద్యోగం ఇచ్చేవారని, ప్రస్తుతం కుమారుడే కాకుండా కుమార్తె ఉన్నా కూడా ఈ విధానాన్ని అమలు చేయు ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అన్ని అలవెన్స్‌లపై 25శాతం పెరుగుదల ద్వారా ప్రధానమైన అండర్ గ్రౌండ్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్ పెరుగుదలతో కార్మికులకు గణనీయమైన పెరుగుదల లభిస్తున్నదన్నారు. కార్మికులకు ఏరియర్స్ రూ.2,30,000 నుండి రూ.4 నాలుగు లక్షల వరకు రాబోతున్నాయని, త్వరలోనే ఏరియర్స్‌ను యాజమాన్యంతో మాట్లాడి ఇప్పించుటకు కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె వీరభద్రయ్య, సెంట్రల్ కార్యదర్శి ముస్కే సమ్మయ్య, ఆర్కే-5 బ్రాంచ్ సహాయ కార్యదర్శి గొర్రె నర్సయ్య, శ్రీరాంపూర్ ఏరియా సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఏరియా కార్యదర్శిలు చిలుక రామచందర్, నగేష్ పాల్గొన్నారు.

గిరిజన రైతులకు వరం 'గిరి వికాసం'

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామ గ్రామానికి గిరివికాస్ పథకం ద్వారా మంజూరైన ఆరు బోరు బావులను గిరి వికాస్ ఇన్‌ఛార్జి రమాదేవి శనివారం ఆలుగామ గ్రామంలోని పోడు భూములలో కొబ్బరికాయ కొట్టి బోరు పాయింట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన రైతుకు భూమి సాగు చేసుకునేందుకు అవసరమైన పేద రైతులకు గిరి వికాస్ పథకం కింద బోరు వేయించి మోటారు, విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ముగ్గురు నలుగురు కలిసి ఒక క్లస్టర్‌గా ఏర్పడి బోరు బావి కావాలనుకుంటే భూగర్భ జల శాఖ వారు బోరు పాయింట్ చూసి ప్రతిపాదనలో ఆమోదం తెలుపుతుందన్నారు. ప్రతి గిరిజన రైతు బిడ్డకు గిరి వికాస్ పథకం ద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపుతుందని అన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ సేవలు

నవతెలంగాణ-కాసిపేట

తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, దీంట్లో భాగంగా ఇప్పుడు ఇంటి వద్దకే ఆధార్ సేవలు తీసుకురావడం జరుగుతుందని మంచిర్యాల పోస్టల్ అసిస్టెంట్ సూపరిడెండింట్ ఆర్ రామారావు ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ఆధార్ చిన్న పిల్లలకు, 17 ఏళ్లలోపు ఆధార్ అప్డేషన్లు ఫ్రీగా అందించడం జరుగుతుందని, బయోమెట్రిక్ అప్డేషన్‌కు రూ.100, పేరు, పుట్టిన తేది, అడ్రస్ మార్పుకు రూ.50 రుసుము ఉంటుందన్నారు. ఆధార్ అన్ని మార్పులు, చేర్పులు అన్ని సేవలు అందించడం జరుగుతుందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 9347081345 నెంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

సీఎం ఇచ్చిన హామీలపై స్పందించాలి



నవతెలంగాణ-మందమర్రి

ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలపై మంచిర్యాల పర్యటనలో ఆయన స్పందించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ అన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కెకె-5 ఫిట్ సెక్రటరీ సంకే వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక క్షేత్రంలోని మంచిర్యాల జిల్లాకు ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తున్నందున గతంలో సింగరేణి కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన సొంతింటి పథకంపై ప్రకటన చేయాలని, అలవెన్స్ లపై ఐటి మాఫీ చేయాలన్న కోల్ ఇండియా ఒప్పందాన్ని సింగరేణి కార్మికులకు అమలు చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించి కార్మికులకు తీపి కబురు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం గనిలోని సమస్యలపై మాట్లాడుతూ బోల్టర్ మిషన్లు రిపేర్లు ప్రైవేటు వారు సరిగా చేయడం లేదని దీనిపై దృష్టి సారించి కార్మికులకు ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటస్వామి, అల్లి.రాజేందర్‌తో పాటు ఉపాధ్యక్షులు అలవాల సంజీవ్, ఆర్గనైజర్స్ కె.శ్రీనివాస్, భరత్, శివ, దొండ నవీన్, ఆదర్శ్, చైతన్యరెడ్డి, కల్వల శ్రీనివాస్, తిరుపతి, సీనియర్ నాయకులు రాజేశం పాల్గొన్నారు.

6న ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

గిరిజన గురుకులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హయత్‌నగర్ లోని బాలబాలికల కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల ఆరో తేదీన ఉట్నూర్‌లోని కేబి కాంప్లెక్స్‌లో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆసిఫాబాద్ పీటీజీ ప్రిన్సిపల్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని కొలాం, తోటి, మన్నే తెగలకు చెందిన పదో తరగతి పూర్తయిన విద్యార్థులు సరైన ధ్రువీకరణ పత్రాలతో కౌన్సిలింగ్ ప్రక్రియకు హాజరుకావాలని, ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ ఎంపీపై ఫిర్యాదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

క్రైస్తవుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుపై చర్యలు తీసుకోవాలని శనివారం క్రైస్తవ సంఘాల నాయకులు కె యేసుకుమార్, బోడ రాకేష్‌నాయక్‌లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మత మార్పిడులకు పాల్పడితే బుల్లెట్లు దింపుతామంటూ ఎంపీ చేసిన వ్యాఖ్యలపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



మృతి చెందిన ఆవుకు పరిహారం

సిర్పూర్(టి) : మండలంలోని ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన వడాయి పాండు రైతుకు చెందిన ఆవు మూడు నెలల క్రితం పులిదాడిలో మరణించగా ప్రభుత్వం రూ.25వేల పరిహారం అందజేసినట్టు బీట్ అధికారులు అరవింద్, నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆవు పులిదాడిలో మరణించగా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపించడంతో ప్రభుత్వం నుండి పరిహారం చెల్లించిందని వారు తెలిపారు. అటవీ ఆవాస ప్రాంతాల్లో ఉన్న రైతులు తమ పశువులను మేత కోసం అటవీ ప్రాంతాలకు తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.



బీఆర్ఎస్‌తోనే రైతు రాజ్యం



భీమారం : మాట్లాడుతున్న బాల్క సుమన్

నవతెలంగాణ-భీమారం

ప్రత్యేక రాష్ట్ర అకాంక్షలకు అనుగుణంగా రైతు రాజ్యమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు దినోత్సవంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతాంగానికి సరైన సాగు నీరందక సాగులో వెనకబడ్డామని తెలిపారు. నేడు కేసీఆర్ పాలనలో 24గంటల ఉచిత విద్యుత్‌తో పాటు జలకళతో తొణికిసలాడే చెరువులు, ప్రాజెక్టులు సమకూర్చుకున్నామని తెలిపారు. అంతే కాకుండా రైతు బీమాతో ధీమా కల్పించి, పంట పెట్టుబడి సొమ్మును ప్రభుత్వమే భరిస్తోందని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా సానుకూల ప్రభావంతో పరిష్కరించుకునే సత్తా కేవలం కేసీఆర్ పాలనలోనే సాధ్యమౌతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దె రాంరెడ్డి, జెడ్పీటీసీ భుక్య తిరుమల, తహసీల్దార్ వాసంతి, ఎంపీడీఓ శ్రీనివాస్, రైతు సమన్వయ సభ్యుడు మహేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారులు, నాయకులు పొడేటి రవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

జైనూర్ : రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. శనివారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని రైతువేదికలో క్లస్టర్ల వారీగా రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండడమే కేసీఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. మండలంలోని లేండిజాల, గౌరీ, రాసిమెట్ట, ఉషెగావ్‌తో పాటు సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని రైతులు ఎడ్ల బండిపై భారీ ఎత్తున ర్యాలీలతో రైతువేదిక వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో జైనూర్ మండల ఎంపీపీ కుమ్ర తిరుమల విశ్వనాథ్, సిర్పూర్(యు) మండల ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, లింగాపూర్ మండల ఎంపీపీ ఆడె సవిత ప్రేమ్, జెడ్పీటీసీ ఆడె రక్మాబాయి లక్క్యానాయక్, కోవ అరుణ, తహసీల్దార్ సమీర్ హైమద్‌ఖాన్, ఐకేపీ ఏపీఎం సుజాత, ఎంపీటీసీలు ఆత్రం జుగాజీరావు, కుమ్ర భగవంత్‌రావు, కుడిమెత యశ్వంత్‌రావు, ఎంపీడీఓలు ప్రభుదయ, మధుసూదన్, ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, తొడసం ధర్మారావు, ఆత్రం అనిల్, వైస్ ఎంపీపీలు చిర్లె లక్ష్మణ్, ఆత్మారాం నాయక్, ఆత్రం ప్రకాష్, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, మెస్రం గోవింద్‌రావు, మెస్రం రాహుల్, మెస్రం భూపతి, బీఆర్ఎస్ యువ నాయకులు మెస్రం అంబాజీ, జాదవ్ ధరంసింగ్ పాల్గొన్నారు.

దహెగాం : మండలంలోని మొట్లగూడ, గిరవెల్లి, కొంచవెల్లి, దహెగాం, బీబ్రా, కొత్మీర్ క్లస్టర్ల పరిధిలోని రైతువేదికల వద్ద శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించి బీబ్రా గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆత్మ చైర్మన్ కొమురాగౌడ్, జెడ్పీటీసీ శ్రీరామారావు, ఎంపీపీ కంబగోని సులోచన, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బండ కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్, తహసీల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్, ఏఓ వంశీ కృష్ణ, ఏఈఓలు వెన్నెల, శోభన్, సుస్మిత, ప్రదీప్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తోందని జిల్లా సహకార సంఘం అధికారి తారాబాయి అన్నారు. శనివారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలంలోని నాలుగు రైతువేదికల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ డీసీఎస్ఓ తారాబాయి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్అలీ పాల్గొన్నారు.



దహెగాంలో..



సిర్పూర్(టి)లో..

ఆలయంలో డెయిరీ మాజీ చైర్మన్ పూజలు

నవతెలంగాణ-తలమడుగు

బరంపూర్ గ్రామ కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర ఆలయంలో మాజీ విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడి పంటలతో అభివద్ధి చెందాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుడితోపాటు బడులకు కూడా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో లేని పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అన్ని వర్గాల ప్రజలకు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్‌దే అన్నారు, రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఈ నెల 2 తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ బాట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ వనజ హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన పిల్లలకు పూల వర్షం కురిపిస్తూ, మంగళ హారతితో స్వాగతం పలికారు. అంతకుముందు కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి బొట్టు, మొక్కలను అందజేస్తూ పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రాధ తన సొంతంగా తయారుచేసిన కరపత్రాలను విడుదల చేసి ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా పాల్గొన్నారు.

యూజీ కార్యాలయం ప్రారంభం

బాసర : యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో నూతన అడ్మిషన్స్ కాన్ఫిడెన్షియల్ కార్యాలయాన్ని వైస్ ఛాన్సలర్ వెంకట్ రమణ, డైరెక్టర్ సతీష్ కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం 2023-24 యూజీ అడ్మిషన్స్ ఇటీవలే విడుదల చేశారు. అడ్మిషన్స్ ప్రక్రియ సజావుగా సాగేందుకు, పర్యవేక్షణకు, ఫైళ్లను భద్రపరుచుటకు తదితర అంశాలను కాన్ఫిడెన్షియల్ కార్యాలయం నుండి పర్యవేక్షించడం జరుగుతుందని వీసీ అన్నారు. ఈ కాన్ఫిడెన్షియల్ కార్యాలయంలోకి కోఆర్డినేటర్ ఇతర అధికారులు వెళ్లిన అంశాలన్నీ సీసీ కెమెరాలో రికార్డు చేయబడుతుందని వైస్ ఛాన్సలర్ వెంకటరమణ తెలిపారు. ఈ అడ్మిషన్స్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ లైన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అడ్మిషన్స్ ప్రక్రియ వివరాలు నమోదు చేస్తామని వాటిని విద్యార్థులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఆవిష్కరణ

ఆదిలాబాద్ అర్బన్ : సనాతన ధర్మ విశిష్టతను భావి తరాలకు చాటిచెప్పేలా ఆధ్యాత్మిక ఉత్సవాలను నిర్వహించాలని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. శనివారం పట్టణంలోని కుమ్మరి కుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన 21 అడుగుల భారీ ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేద పండితుల సమక్షంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ విగ్రహానికి క్రేన్ సహాయంతో భారీ గజమాలను వేసి పూజలు చేశారు.

చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించే ఊరూర చెరువుల పండుగ ఘనంగా నిర్వహించాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాజేశం ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి చెరువుల పండగపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన నిర్వహించే ఊరురా చెరువుల పండగకు చెరువులను సిద్ధం చేయాలని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో భాగంగా గుర్తించిన 61 ప్రదేశాలలో బతుకమ్మ బోనాల వేడుకలు నిర్వహించాలన్నారు. వేడుకలకు వచ్చే వారికి భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనాలన్నారు శనివారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారని ఇదే స్ఫూర్తితో ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సురక్ష దివస్ కార్యక్రమంతో పాటు, 5న నిర్వహించే తెలంగాణ విద్యుత్ దినోత్సవం, 7వ తేదీన నిర్వహించే సాగు దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. వరుస కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం వేడుకలు



నవతెలంగాణ-తాంసి

ఘనంగా రైతు దినోత్సవ వేడుకలను శనివారం రోజున తాంసి భీంపూర్ మండల కేంద్రాలలో రైతు వేదికలతో పాటు పలు గ్రామాలలో ఉన్న రైతు వేదిక కేంద్రాలను రైతు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు రైతులు ఎడ్లబండ్లతో రైతు వేదికలకు చేరుకున్నారు. ఆయా గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, ఎంపీపీ ప్రత్యేక అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మంజుల శ్రీధర్‌రెడ్డి, రత్నప్రభ సంతోష్, జడ్పీటీసీలు సుధాకర్ తాటిపల్లి రాజు ఎంపీడీఓలు శ్రీనివాస్, ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్, రైతుబంధు మండలం కోఆర్డినేటర్లు గోవర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కుబీర్ : మండల కేంద్రంతో పాటు పల్సి, పార్డీ(బి), సొనారి, మలేగాం, చాత తదితర గ్రామపంచాయతీ క్లస్టర్లలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ తూమ్ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో కన్నుల పండుగగా ప్రారంభమైంది. ఈ పండగ వాతావరణం లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు ఎడ్లబండ్లతో, ర్యాలీగా, రైతు వేదికకు వచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మొయినుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ రేకుల గంగా చరన్, జడ్పీటీసీ అల్కాతాయి సంజయ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పుప్పాల పిరాజీ, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్ మాజీ జడ్పీటీసీ శంకర్ చవాన్, సర్పంచ్‌లు మీరా విజయ్ కుమార్, పుష్పాలత, తహసీల్దార్ విశ్వంభర్, ఎంపీడీఓ లింబాద్రి, వ్యవసాయ సహకార సంఘం సీఈఓ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

తలమడుగు : దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో రైతు వేదికలో తెలంగాణ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఎడ్ల బండి నడుపుతూ ర్యాలీగా రైతు వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్రంలో ప్రవేశపెడుతున్నారని అన్నారు. సుంకిడి గ్రామ రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సోనియమ్మ అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుత తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నట్లు తెలిపారు. ఝరి, తలమడుగు, కజ్జర్ల, కుచులాపూర్, సుంకిడి గ్రామాల రైతు వేదికల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వారిలో తహసీల్దార్ వనజరెడ్డి, మండల అభివృద్ధి అధికారి రమాకాంత్, దిలీప్‌కుమార్, పశు వైద్యాధికారి దూద్‌రాం, మండల రైతుబంధు నాయకుడు గోక జీవన్‌రెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి మహేందర్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, కజ్జర్ల గ్రామ పెద్ద దేవారెడ్డి, ఝరి సొసైటీ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు కళ్లెం కరుణాకర్ రెడ్డి, మోహిత ప్రభ, కంది పోచ్చుబాయి, నర్సింలు, సఖి ఆనంద్, మహేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, అబ్దుల్లా, ఆశన్న యాదవ్, మగ్గిడి ప్రకాష్, పలు గ్రామాల నుండి వచ్చిన నాయకులు, కార్యకర్తలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోయం బాపురావు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రైస్తవుల పట్ల ద్వేషంతో మాట్లాడిన ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపురావు భేషరతు క్షమాపణ చెప్పాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీ వ్యాఖ్యల పట్ల నిరసన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మే 29వ తేదీన ఆదిలాబాద్‌లో క్రైస్తవుల పట్ల ద్వేషంతో చట్ట వ్యతిరేకమైన మాటలు మాట్లాడిన ఎంపీ చర్చ్ పాస్టర్లను బుల్లెట్లతో కాలుస్తానని మాట్లాడటం దారుణమన్నారు. దీనిపై రాష్ట్ర నాయకత్వానికి ఇప్పటికే ఫిర్యాదు చేశామని వెంటనే ఎంపీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆయన మాటలు ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపై కేసులు నమోదు చేయించడం జరుగుతుందన్నారు. ఎంపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల సంఘం నాయకులు బోడ రాకేష్ నాయిక్, యేసు కుమార్, ఎండీ విల్ఫ్రెడ్, ప్రకాశం, తిమోతి, బండి రాజు, రాజేష్, లింగమూర్తి, కరుణ్ కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్ మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందిన బీజేపీ కార్యకర్త గడ్డం సురేందర్ చిన్నమ్మ గడ్డం భూమవ్వ కుటుంబ సభ్యులను శనివారం బీజేపీ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శులు రాజేందర్, శ్రావణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అర్జున్, నాయకులు నరేందర్ బర్కుంట, నాయుడి మురళీధర్, లక్ష్మణ్, శేఖర్, సాయి కృష్ణ, రాజులు ఉన్నారు.



పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



నవతెలంగాణ-నిర్మల్

పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల తర్వాత మొదటిసారి నిర్మల్ జిల్లాకు వస్తున్నారని అన్నారు. నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి రావడాన్ని సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ స్వాగతిస్తోందన్నారు. గతంలో ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్ రెండు రోజులు జిల్లాలో కూర్చి వేసుకొని కూర్చుని పోడు భూములు సాగు చేస్తున్న అందరికీ హక్కు పత్రాలు ఇస్తామని చెప్పినటువంటి సీఎం ఎన్నికల తర్వాత ఇదే మొదటిసారి ఈ జిల్లాకు వస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నిర్మల్‌లో జరగబోయేటటువంటి బహిరంగ సభలో పోడు భూములు సాగు చేస్తున్నటువంటి ప్రతి ఒక్కరికి పట్టాలు ఇస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తూ కాలం గడుపుతూ ముందుకు పోవడం సరి అయింది కాదన్నారు. సర్వే చేసిన ప్రతి ఒక్కరికి భూమికి సంబంధించినటువంటి రసీదులు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శీతల్కర్ అరవింద్, సీనియర్ నాయకులు నాగేల్లి నరసయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-కాసిపేట

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని కాసిపేట మండలంలోని ముత్యంపల్లి హై స్కూల్ హెచ్‌ఎం రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. శనివారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లి, బుగ్గగూడం, పాత వరిపేట, కొత్త వరిపేట, ఎస్సీ కాలనీల్లో ముత్యంపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆధ్వర్యంలో బడి బాటలో భాగంగా ప్రచారం నిర్వహించి, పాఠశాల కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను విద్యార్థులకు కల్పిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, పల్లె కృష్ణ గోపాల్, జ్యోతి, మాధవి లత, అనసూర్య, అర్చన పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్

- జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్

నవతెలంగాణ-నార్నూర్

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్‌ని జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ కొనియాడారు. శనివారం మహాగావ్ గ్రామంలోని రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. రైతు దినోత్సవం సందర్భంగా రైతులతో కలిసి ఎడ్లబండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు, పంట నష్ట పరిహారం లాంటి ఎన్నో కార్యక్రమాలను శ్రీకారం చుట్టారని తెలిపారు. అదేవిధంగా తాడిహత్నూర్, బాబేఝరి గ్రామాల్లోని రైతువేదికతో పాటు తదితర గ్రామాల్లోని రైతు వేదికలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఫ్యాక్స్ ఇన్‌ఛార్జి చైర్మెన్ ఆడే సురేష్, డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, స్థానిక సర్పంచ్ యశ్వంత్ రావ్ రాథోడ్, ఏఓ గిత్తె రమేష్, ఎంపీడీఓ రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యునూస్ అక్బాని, ఎంపీఓ స్వప్న శీలా, ఏఈ సుభాని, సర్పంచ్‌లు సేవంత ప్రభాకర్, కైలేశ్వరి సాగర్, సర్పంచులు ఆత్రం పరమేశ్వర్, రూపదేవ్, యాదవ్‌రావు ఉపసర్పంచ్ విష్ణు, వివిధ గ్రామాల ఏఈఓలు సాయికృష్ణ, రాథోడ్ రాజేశ్వర్, సైజాన్ అర్ఫత్, నరేష్, నిఖిల్ రాజ్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు కార్యదర్శులు ఉన్నారు.

